క్లుప్తంగా

ఆలయానికి ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న సేవకులు

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 4 నెలలకు సంబంధించి రెండు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి రూ. 3.92 లక్షల ఆదాయం సమకూరింది. ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈఓ సాయిచంద్ర, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల పునరుద్ధరణకు రూ.1.35 కోట్లు



రూపనగుడిలో శిథిలావస్థకు చేరిన రూపేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాలు

ఉయ్యాలవాడ : రూపనగుడి గ్రామంలో శిథిలావస్థకు చేరిన రూపేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి రూ.1.35 కోట్లు వ్యయం చేయనున్నట్లు ఆలయాల ఈఓ చంద్రుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం కోసం గ్రామస్తులు విరాళాలు ద్వారా రూ.25 లక్షలు, దేవస్థానం నిధుల నుంచి రూ.10 లక్షలు, కామన్ గుడ్ ఫండ్ కింద దేవదాయశాఖ రూ. కోటి మంజూరు చేసిందని ఈఓ వెల్లడించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామ ని చెప్పారు.

స్టేడియాల అభివృద్ధికి కృషి

నంద్యాల(న్యూటౌన్): క్రీడా స్టేడియాల అభివృద్ధిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. బుధవారం పట్టణంలోని గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో క్రీడా స్టేడియంకు రూ.35లక్షల విలువజేసే ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా స్టేడియాలకు చేరుతుందన్నారు. క్రీడలకు ప్రోత్సాహం కల్పిస్తున్న గురురాఘవేంద్ర పాఠశాల డైరెక్టర్లు షేక్షావలిరెడ్డి, మౌలారెడ్డి, బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిని అభినందించారు. ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏపీరెడ్డి, చైర్మన్ సుధాకర్, ఎంఈఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

మోదీ సభకు బస్సుల ఏర్పాటు

శిరివెళ్ల: ఈ నెల 16వ తేదీన కర్నూలు సమీపంలో జరగనున్న ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభకు మండలం నుంచి 1500 మందిని తరలిస్తున్నట్లు ఏంపీడీఓ శివ మల్లేశ్వరప్ప తెలిపారు. బుధవారం వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళల సమీకరణపై సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతు మండలానికి ప్రభుత్వం 31 బస్సులను కేటాయించిందన్నారు. శిరివెళ్లకు 9, చెన్నూరుకు 6,యర్రగుంట్ల, బోయలకుంట్ల, గుంప్రమాన్దిన్నెలకు 5 చొప్పున కేటాయించిందని చెప్పారు. మహదేవపురం, కోటపాడులకు మూడు చొప్పున, వీరారెడ్డిపల్లె, కాదరబాదర, వెంకటేశ్వరపురం, వెంకటాపురం, వనికినిదిన్నె, జీనేపల్లె, గుండంపాడు, గంగవరంలకు రెండేసి బస్సులను పంపుతారని పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు ఆయా గ్రామాల్లో టిఫన్ ఏర్పాటు, మధ్యాహ్నం నన్నూరు వద్ద భోజన సదుపాయం కల్పిస్తారని వివరించారు. ఏపీఎం రాజశేఖరరెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మోక్షజ్ఞ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ చూపారన్నారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని అధ్యాపకులు ఆకాంక్షించారు.

శ్రీశైలంలో త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి అనుమతులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. దేవదాయశాఖ టెండర్లు పిలిచింది. టెండర్‌లో 33 ఏళ్ల లాంగ్ లీజ్ పద్ధతిపై శ్రీశైల దేవస్థానం రెండు ఎకరాల భూమిని శ్రీవెంకటేశ్వర లాడ్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారికి కేటాయించింది. ఆ భూమిలో నిర్మాణాలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 2024–2029 ప్రకారం శ్రీవెంకటేశ్వర లాడ్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారు హిల్టన్ గ్రాండ్ ఇన్ బ్రాండ్ పేరుతో త్రీ స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది.

17న టెంకాయల వేలం

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని పురాతన నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని టెంకాయల విక్రయ హక్కులకు ఈ నెల 17న వేలం పాట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు.

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

- ప్రభుత్వ ఒత్తిడితో కర్నూలుకు తరలిన బస్సులు
- జిల్లా వ్యాప్తంగా 310 బస్సుల కేటాయింపు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని సర్కారు
- గంటల తరబడి నిరీక్షించిన ప్రయాణికులు



నంద్యాల బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



కర్నూలు సభకు వెళ్లేందుకు సిద్ధంగానున్న బస్సులు,



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

నంద్యాల(వ్యవసాయం): కర్నూలు సమీపంలోని నన్నూరు వద్ద గురువారం నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభకు కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని 310 పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించారు. అయితే ప్రయాణికుల అవసరాలను లెక్కచేయకుండా కర్నూలుకు తరలించడంతో బుధవారం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో బస్టాండ్‌లన్నీ ప్రయాణికులతో కిక్కిరిశాయి. మధ్యాహ్నం నుంచి అన్ని స్టాండ్ల నుంచి బస్సులను కర్నూలుకు తరలించడానికి ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. దీంతో ప్రయాణికుల రద్దీ ఉండటంతో వృద్ధులు, మహిళలు, పిల్లలు గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడ్డారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు అరకొరగా బస్సులు ఉండటంతో వచ్చిన బస్సుల్లో ఎక్కేందుకు తోపులాటలు జరిగాయి. ఇలా నిత్యం బస్సుల కేటాయింపుతో ప్రయాణికులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుండటంపై పలువురు మండిపడ్డారు. కాగా.. బస్సుల కొరత శుక్రవారం ఉదయం వరకు ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా కర్నూలుకు వెళ్లనున్న బస్సులు..

డిపోలు	తరలిన బస్సులు
ఆళ్లగడ్డ	47
బనగానపల్లె	45
నంద్యాల	57
ఆత్మకూరు	44
కోవెలకుంట్ల	39
డోన్	35
నందికొట్కూరు	43
మొత్తం	310

బస్సు లేక ఇబ్బంది పడ్డాం

పెళ్లి నిమిత్తం కుటుంబం అంతా కలిసి నంద్యాలకు వచ్చాం. కార్యక్రమం ముగించుకున్న తర్వాత తిరుగు ప్రయాణం కోసం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌కు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్నాం. అప్పటి నుంచి సాయంత్రం 6 గంటలైనా బస్సు లేకపోవడంతో నిరీక్షిస్తున్నాం. ఎంక్వైరీలో అడిగితే ఎక్స్‌ప్రెస్ బస్సులు కర్నూలుకు తరలించడం వల్ల బస్సులు తక్కువగా ఉన్నాయని, బస్సు వచ్చేంత వరకు వేచి ఉండాలని చెప్పారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది.

– మహేశ్వరి, ప్రయాణికురాలు, రాజంపేట

ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం సరికాదు



ప్రధాని పర్యటన పేరుతో ఆర్టీసీ బస్సులన్నీ కర్నూలుకు తరలించి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం కూటమి ప్రభుత్వానికి తగదు. ప్రయాణికుల అభ్యున్నతికి పాటు పడాల్సిన ప్రభుత్వం, వారిని అగచాట్లు పెట్టడం సరికాదు. బస్సులు కేటాయిస్తున్నప్పుడు.. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం దారుణం.

–ఎం.శంకర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి, నంద్యాల

బోసిపోయిన వారపు సంత



చాగలమర్రిలోని సంత మార్కెట్‌లో అరకొరగా వెలసిన దుకాణాలు

- నిత్యావసర సరుకులు, కూరగాయలు ఇళ్ల వద్దకే
- లబోదిబో మంటున్న చిరువ్యాపారులు



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న దుకాణాలు

చాగలమర్రి: స్థానిక మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ప్రతి బుధవారం నిర్వహిస్తున్న వారపు సంత వ్యాపారులు, కొనుగోలుదారులు లేక బోసిపోయింది. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలో నిత్యావసర సరుకులు, కూరగాయల విక్రయానికి ఆటోలు, తోపుడు బండ్లలో ఇళ్ల వద్దకే వస్తుండటంతో ప్రజలు సంత మార్కెట్‌కు రావడానికి ఆసక్తి చూపడం లేదు. గతంలో బుధవారం వచ్చిందంటే మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సంత మార్కెట్‌లో కూరగాయాలు, నిత్యావసర సరకుల కొనుగోలుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీగా ఉండేది. 2019లో కోవిడ్ సమయంలో ప్రభుత్వం లాక్ డౌన్ విధించినప్పటి నుంచి సంత మార్కెట్ పరిస్థితి రోజు రోజుకు దిగజారి పంచాయతీ అధికారులు సంతను రద్దు చేసే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా.. సంత మార్కెట్‌లో వ్యాపారం జరిగినా జరగకపోయినా పంచాయతీ వారికి గేటు రుసుము చెల్లించాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. రుసుము చెల్లించలేక వ్యాపారులు సంత మార్కెట్‌కు రావడం మానేశారు.

ఇళ్ల వద్దకే అన్నీ వస్తున్నాయి



స్థానిక పంచాయతీ పరిధిలోని సంత మార్కెట్‌లో వేలం పాటలో పాల్గొని రూములకు వేలాది రూపాయల అద్దెలు చెల్లిస్తున్నాం. ఆటోలు, తోపుడుబండ్లలో పలువురు వ్యాపారులు కూరగాయలు, నిత్యావసర వస్తువులు, పండ్లను ఇళ్ల వద్దకే తీసుకెళ్లి అమ్ముతుండటంతో మాకు గిరాకీ లేదు. వ్యాపారాలు లేకపోయినా మార్కెట్ రుసుము చెల్లించాల్సి వస్తోంది.

– ముల్లా బురాందీన్, వార్డు సభ్యుడు, చాగలమర్రి

మోదీ పర్యటనను విజయవంతం చేద్దాం

నంద్యాల(అర్బన్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గురుమూర్తి తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన భారతీయ కిసాన్ మోర్చా జిల్లా గౌరవాధ్యక్షుడు తూము శివారెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ, పేదలకు వరంలాంటిదని, ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేస్తూ శంకుస్థాపనలకు వస్తున్న ప్రధాని పర్యటన చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. నాయకులు రాముగౌడ్, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

గుర్తుండిపోయేలా ప్రధాని మోదీ పర్యటన

నంద్యాల(అర్బన్): ఈనెల 16వ తేదీన కర్నూలు జిల్లాలో జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనను గుర్తిండిపోయేలా నిర్వహిద్దామని రాష్ట్ర మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మోదీ పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రుల ఉన్నతస్థాయి బృందం బుధవారం నంద్యాలకు చేరుకుంది. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సీమ ప్రగతికి పెద్దపీట వేస్తున్న ప్రధాని ప్రాంతానికి రావడం సంతోషదాయకమన్నారు. మంత్రులు ఫరూక్, రాంప్రసాదరెడ్డి, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, రాధాకృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



శేషఫణిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నంద్యాల పట్టణంలోని రమణి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల కాన్ఫరెన్స్ హాలులో డాక్టర్ గురుప్రసాద్ నేతృత్వంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న బలపనూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు అవ్వారి శేషఫణిని ఘనంగా సన్మానించారు. శేషఫణి మాట్లాడుతూ శారదా విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు సత్కరించడం హర్షించదగ్గ విషయమన్నారు. సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, డాక్టర్లు సుజాత, శ్రావణ్, సంతోష్, శ్రీనివాసులు,సంపత్, ప్రభాకర్, రామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల ధర్నా



పోస్టాఫీసు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకుడిని కేంద్రం ఉద్యోగం నుంచి తొలగించడంపై బుధవారం ఆలిండియా గ్రామీణ ఉద్యోగులు ఆర్ఎస్ రోడ్డులోని పోస్టాఫీసు ఎదుట ఒక్క రోజు ధర్నా నిర్వహించారు. నాయకులు కాశిం వలి, మనోజ్‌కుమార్ మాట్లాడుతూ 2023లో సార్వత్రిక సమ్మెను కారణంగా చూపి బెంగళూరులో పని చేస్తున్న కేంద్ర నాయకుడు ఎస్ఎస్ సహదేవయ్యను ఈనెల 8న సర్వీసు నుంచి తొలగించడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా కేంద్ర సంఘాల పిలుపు మేరకు ధర్నా నిర్వహించామని చెప్పారు. ఆ ఉద్యోగిని మళ్లీ విధుల్లోకి తీసుకునేంత వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఉద్యోగులు మధుసూదన్, శశికుమార్, రామలింగారెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం దేశానికి గర్వకారణం





అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం భారత జాతి గర్వించదగ్గ వ్యక్తి అని ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు అమీర్‌బాషా కొనియాడారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ప్రపంచ విద్యార్థుల దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగానున్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో బుధవారం భారత మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ ఎయిర్ స్పేస్ ఇంజినీర్‌గా అనేక పరిశోధనలు చేసి ప్రపంచ దేశాల్లో దేశ కీర్తి, ప్రతిష్టలు పెంచారని కొనియాడారు. భారతదేశపు మిస్సైల్‌మాన్‌గా పేరు గాంచి భారత 11వ రాష్ట్రపతిగా అయ్యారన్నారు. నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, హనుమంతు, సుదర్శన్‌రెడ్డి, జగదీష్, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

పీఎం పర్యటన ముందురోజే ఆంక్షలు



రింగ్‌పార్క్ వద్ద వాహనాలను నిలిపివేస్తున్న పోలీసులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలో గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటించనున్నారు. ఆయనతో పాటు గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారుల భద్రత దృష్ట్యా గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు, దోర్నాల నుంచి శ్రీశైలం వరకు వాహనాల రాకపోకలు నిలిపేస్తూ కలెక్టర్, ఎస్పీలు ఆదేశాలు జారీ చేశారు. కాగా డ్యూటీలో ఉన్న పోలీసు అధికారులు అత్యుత్సామంతో బుధవారం ఉదయం నుంచే ప్రయాణికుల రాకపోకలకు తరచూ అంతరాయం కలిగించారు. రింగ్‌పార్క్ వద్ద బారికేడ్లు పెట్టి స్థానికులను, శ్రీశైలంలో పనులు చేసుకునే వారిని ఇబ్బందులకు గురి చేశారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయరూ..



ఎస్పీవైరెడ్డి ఆగ్రో ఫ్యాక్టరీ వద్ద రెయిలింగ్ లేని వంతెన




పులిమద్ది సమీపంలో రక్షణ గోడలు లేని వంతెన

- వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయని వైనం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని యంత్రాంగం

నంద్యాల(అర్బన్): నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రధాన రహదారుల్లో ఏర్పాటైన వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. స్థానిక ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఫ్యాక్టరీ సమీపంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్లే జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియక వాహన దారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు వాహనాలు కింద పడి పలువురికి గాయాలైన సందర్భాలు ఉన్నాయి. అలాగే.. నంద్యాల నుంచి పులిమద్ది వైపు వెళ్లే ప్రధాన రహదారిలో పాలేరు వంతెనకు రెయిలింగ్ లేక వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకం. ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలి



రీసర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి

గోస్పాడు: రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని, విజయవాడ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని దీబగుంట్ల, శిరివెళ్ల, ఎర్రగుంట్ల, సంజామల మండలంలోని బొందెల దిన్నె గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మూడో విడత రీ సర్వేలో రైతులు స్వచ్ఛందంగా పొలాల గట్లను సర్వేయర్లకు చూపించాలి. పాసుపుస్తకాలు, డాక్యుమెంట్లను పొలాల యజమానులు సర్వేయర్లకు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా సర్వేయర్లకు పలు సూచనలిచ్చారు. మండల సర్వేయర్లు చిన్న మల్లయ్య, ఉమామహేశ్వరరావు, మల్లేశ్వరి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు పర్యాటకులకు వరం



భక్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహానంది: జీఎస్టీ తగ్గింపు పర్యాటకులకు ఎంతో మేలు చేకూరుస్తుందని పర్యాటక శాఖ జిల్లా అడ్మిన్ నాగార్జునరావు అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై బుధవారం పర్యాటక ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా మహానందితో పాటు అహోబిలం, బెలూం గుహలు పర్యాటక ప్రదేశాల వద్ద యూనిట్ ఇన్చార్జ్‌లు, అధికారులు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు పర్యాటక ప్రదేశాలను తిలకిస్తూ ఆనందం, ఆహ్లాదం పొందేలా ఉంటుందన్నారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణతో వరిలో అధిక దిగుబడులు

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్



నంద్యాల సమీపంలో సాగైన వరి పైరు

నంద్యాల(అర్బన్): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పైరుకు సోకిన తెగుళ్లను నివారించుకుంటేనే అధిక దిగుబడులు సాధ్యమని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త చైతన్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాలో 65వేల హెక్టార్లలో వరి పంట సాగులో ఉందని, ప్రస్తుతం పిలకలు వేసే దశ నుంచి పూత దశలో ఉందన్నారు. ప్రస్తుతం పంటకు అగ్గి తెగులు, పాముపొడ, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు సోకే ప్రమాదం ఉందన్నారు. తెగుళ్ల యాజమాన్య పద్ధతులు తెలుసుకొని సరైన నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.

అగ్గితెగులు...

అగ్గితెగులు సోకిన మొక్కల ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు కనిపిస్తాయని, ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ రంగులో ఉండి మధ్య భాగం బూడిద రంగులో ఉంటుందన్నారు. తెగులు ఉధృతి అధికంగా ఉంటే మచ్చలు పెద్దవై ఒక దానితో ఒకటి కలిసి పోతాయని, దీని ద్వారా ఆకులు పాక్షికంగా, పూర్తిగా ఎండిపోయి మొక్కలు తగలబడినట్లు కనిపిస్తాయన్నారు. నివారణకు లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ 75శాతం 1.5మి.లీ ఐసో ప్రొథయోలేన్ 40శాతం చొప్పున కలిపి పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. తెగులు వ్యాప్తికి అనుకూల పరిస్థితులు ఉంటే 15రోజుల వ్యవధిలో రెండో సారి మందులు మార్చి పిచికారీ చేయాలన్నారు.

పొడతెగులు..

పొడతెగులు సోకిన మొక్కల కాండం మొదళ్లపై నీటి మట్టానికి దగ్గరగా బూడిద రంగు నీటి మచ్చలు ఏర్పడటం మొదటి లక్షణం. మచ్చలు పెద్దవై అంచులు ముదురు గోధుమ వర్ణంలో ఉండి మధ్యభాగం బూడిద రంగులో ఉంటుందన్నారు. మచ్చలు పాము పొడ వంటి వాటిగా కనిపిస్తాయని, ఈ తెగుళ్లు కనిపించిన వెంటనే నత్రజని వాడకాన్ని తగ్గించి పొటాష్ ఎరువు వాడాలని సూచించారు. నివారణకు 2.0మి.మీ లీటరు నీటికి, వాలీడామైసిన్ 2.0 మి.లీ, ప్రొఫికొనజోల్ 1.0మి.లీ, అజాక్సీ స్ట్రోబిన్ 23శాతం ఎస్‌సీ 1.0మి.లీ, అజాక్సీ స్ట్రోబిన్, డైఫెన్ కొనజోల్ 1.25మి.లీ లీటరు నీటికి కలిపి పైరు మొదళ్లు బాగా తడిసేలా పిచికారీ చేయాలని చెప్పారు.

ఎండుతెగులు..

- గాలితో కూడిన వర్షం, ఎడతెరపి లేని వర్షాలు ఎక్కువ రోజులు కురిసినప్పుడు బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు పంటను ఎక్కువగా ఆశిస్తుందన్నారు. ఈ తెగులును శిలీంద్ర నాశినిలతో అరికట్టలేమని, తెగుళ్ల యాజమాన్యం ద్వారా నత్రజని ఎరువును 2–3 దఫాలుగా వేసుకోవాలన్నారు. తెగులు 5శాతం కంటే ఎక్కువగా ఉంటే నత్రజని ఎరువును తాత్కాలికంగా నిలిపివేసి పొటాష్ ఎరువు వాడాలని తెలిపారు.
- అంకురం ఏర్పడే దశలో పొటాష్ ఎరువును 20 కేజీలు ఎకరానికి తప్పనిసరిగా వాడాలని, దీని ద్వారా మొక్కలు ధృడంగా పెరిగి తెగులును తట్టుకుంటాయన్నారు. ఎండాకు తెగులు ఆశించిన పొలం నుండి నీటిని కాల్వల ద్వారా బయటకు పంపాలన్నారు. బ్యాక్టీరియా నాశక మందులైన ప్లాంటోమైసిన్ ఒక గ్రాము లీటరు నీటికి, కాపర్ హైడ్రాక్సైడ్ 2.0 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని వివరించారు.